మూడున్నరేండ్లలో ట్రిపుల్ ఆర్

- డిసెంబర్‌లో హైదరాబాద్-విజయవాడ ఆరులేన్ల పనులు
- ఢిల్లీలో 24 అంతస్థులతో తెలంగాణ టవర్ నిర్మాణం
- హైదరాబాద్- శ్రీశైలం హైవేపై రూ. 6000 కోట్లతో ఎలివేటెడ్ కారిడార్
- రూ. 5600కోట్లతో హైదరాబాద్-బెంగుళూరు గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే
- ఉన్నతస్థాయి సమీక్ష అనంతరం మంత్రి కోమటిరెడ్డి వెల్లడి

హైదరాబాద్, జూన్ 19 (నమస్తే తెలంగాణ): వచ్చే మూడు-మూడున్నరేండ్లలో రీజినల్ రింగ్ రోడ్డు (ట్రిపుల్ ఆర్)ను పూర్తిచేస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ధీమా వ్యక్తంచేశారు. త్వరలోనే భూసేకరణ పూర్తిచేసి వచ్చే అక్టోబర్‌లో ప్రధాని చేతులమీదుగా పనులకు శంకుస్థాపన చేస్తామని చెప్పారు. వివిధ అభివృద్ధి పనులపై మంత్రి కోమటిరెడ్డి బుధవారం అధికారులతో సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రంలో ఐదు సూపర్ స్పెషాలిటీ దవాఖానలు నిర్మిస్తున్నట్టు తెలిపారు. అందులో ఒకటి వరంగల్‌లో 24 అంతస్తులతో నిర్మిస్తున్నామని చెప్పారు. ఉస్మానియా దవాఖానను అదేచోట, ప్రస్తుతమున్న డిజైన్ ప్రకారమే పునర్నిర్మించేందుకు అన్ని రాజకీయపక్షాలు ఒప్పుకున్నాయని తెలిపారు. తాము అధికారంలోకి వచ్చాక రూ.700 కోట్లతో నల్లగొండ బైపాస్ రోడ్డును, మంచిర్యాల-ఆర్మూర్ రోడ్లను మంజూరు చేయించామని అన్నారు. ట్రిపుల్ ఆర్ చుట్టూ రైల్ రింగు నిర్మాణంపై కూడా ప్రతిపాదన ఉన్నదని, దానికి కూడా డీపీఆర్‌లు రూపొందిస్తామని చెప్పారు. ఔటర్ రింగురోడ్డుకు ట్రిపుల్-ఆర్‌కు మధ్య రేడియల్ రోడ్లను నిర్మించడంతోపాటు లాజిస్టిక్స్ హబ్‌లు, హార్డ్‌వేర్ పార్క్‌లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హబ్ తదితరవాటిని అభివృద్ధి చేయనున్నామని, ఇది నగరాభివృద్ధిలో ఓ గేమ్ చేంజర్‌గా మారుతుందని చెప్పారు.

హైదరాబాద్-విజయవాడ మధ్య ఆరులేన్లు

నవామి గంగ, సబర్మతి ప్రాజక్టుల తరహాలోనే మూసీ ప్రక్షాళన కూడా చేయాలని నిర్ణయించినట్టు మంత్రి చెప్పారు. హైదరాబాద్-విజయవాడ రహదారిని ఆరు లేన్లుగా అభివృద్ధి చేయనున్నామని, వచ్చే డిసెంబర్‌కల్లా పనులు ప్రారంభమయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. చౌటుప్పల్ వద్ద రూ.375 కోట్లతో ప్రతిపాదిత ఫ్లైఓవర్ నిర్మాణ పనులకు ఈ నెల 23న శంకుస్థాపన చేయనున్నట్టు చెప్పారు. అలాగే, హైదరాబాద్- బెంగుళూరు, హైదరాబాద్-నాగపూర్ రహదారులను కూడా ఎక్స్‌ప్రెస్‌వేలుగా అభివృద్ధి చేయనున్నట్టు తెలిపారు. అసంపూర్తిగా ఉన్న ఉప్పల్ ఫ్లైఓవర్ నిర్మాణం పనులను నెలరోజుల్లో ప్రారంభిస్తామని, అలాగే అంబర్‌పేట్ ఫ్లైఓవర్‌ను వచ్చే మూడు నెలల్లోగా పూర్తిచేసి అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు. హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో అల్వాల్ వద్ద 14 కిలోమీటర్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి త్వరలోనే డీపీఆర్‌ను రూపొందిస్తామని చెప్పారు. త్వరలోనే ఢిల్లీలో 24 అంతస్తులతో తెలంగాణ భవన్ నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, వచ్చే రెండు నెలల్లో టెండర్లు పిలుస్తామని తెలిపారు.

శ్రీశైలం హైవేపై ఎలివేటెడ్ కారిడార్

హైదరాబాద్- శ్రీశైలం హైవేపై నల్లమల అటవీ ప్రాంతంలో రూ.6000 కోట్లతో ఎలివేటెడ్ కారిడార్‌ను, రూ.5600 కోట్లతో హైదరాబాద్- బెంగళూరు గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే నిర్మించనున్నామని మంత్రి చెప్పారు. రోడ్ల మరమ్మతులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న రూ.400 కోట్ల బిల్లులను త్వరలోనే చెల్లించనున్నట్టు తెలిపారు. రాజేంద్రనగర్‌లో వచ్చే రెండేండ్లలో రూ.100 కోట్లతో దేశంలోనే అత్యుత్తమమైన హైకోర్టును నిర్మించనున్నామని, త్వరలోనే ఆర్కిటెక్ట్‌ను ఫైనల్ చేస్తామని చెప్పారు. పాటిగడ్డ ప్రాంతంలో హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్ భవనాన్ని నిర్మిస్తామని, దీనికి స్థలం సిద్ధంగా ఉన్నదని, డీపీఆర్ సిద్ధమవుతున్నదని వివరించారు.

అదనపు ఫీజులు వసూలు చేయొద్దు

- మెడికల్ కాలేజీల యాజమాన్యాలతో మంత్రి దామోదర రాజనర్సింహ

హైదరాబాద్, జూన్ 19 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో వైద్యవిద్యకు అదనపు ఫీజులు వసూలు చేయవద్దని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ స్పష్టం చేశారు. బయోమెట్రిక్ అటెండెన్స్ విధానంలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బుధవారం ఆయన సచివాలయంలో ప్రైవేటు మెడికల్, డెంటల్ కాలేజీల యజమానులు, డీన్‌లతో సమావేశమయ్యారు. రాష్ట్రం నుంచి నాణ్యమైన వైద్యులను తయారుచేయడమే తమ లక్ష్యమని చెప్పారు. పారదర్శకంగా, నిరంతర పర్యవేక్షణలో వైద్య విద్యాబోధన జరగాలని సూచించారు. ఈ సందర్భంగా యజమానులు, డీన్లు, ప్రిన్సిపాళ్లు చేసిన విజ్ఞప్తులపై మంత్రి సానుకూలంగా స్పందించారు. సమావేశంలో డీఎంఈ వాణి, ప్రత్యేక అధికారి విమల థామస్ తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో పుట్టిన పాపకు లైఫ్‌టైమ్ ఫ్రీ బస్

- ప్రకటించిన టీజీఎస్ఆర్టీసీ
- మానవత్వం చాటిన సిబ్బందికి సన్మానం

హైదరాబాద్, జూన్ 19 (నమస్తే తెలంగాణ): కరీంనగర్ బస్టాండ్‌లో పురుడు పోసుకున్న చిన్నారికి జీవితకాలం ఉచితంగా ప్రయాణించేలా బస్‌పాస్‌ను అందించనున్నట్టు టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం ప్రకటించింది. ఆర్టీసీ బస్సులు, బస్‌స్టేషన్లలో పుట్టిన పిల్లలకు జీవితకాలపు ఉచిత బస్‌పాస్ ఇవ్వాలన్న యాజమాన్య గత నిర్ణయం మేరకు ఈ పాపకూ బర్త్‌డే గిఫ్ట్‌గా ఉచిత బస్‌పాస్‌ను మంజూరు చేస్తామని వెల్లడించింది. కరీంనగర్ బస్‌స్టేషన్‌లో పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణికి చీరలు అడ్డుకట్టి కాన్పు చేసి మానవత్వం చాటిన తమ సిబ్బందిని యాజమాన్యం హైదరాబాద్ బస్ భవన్‌లో బుధవారం ఘనంగా అభినందించింది. సంస్థ ఉన్నతాధికారులతో కలిసి సంస్థ ఎండీ వీసీ సజ్జనార్ వారిని ఘనంగా సన్మానించారు. ఆపద సమయంలో సేవా తర్పరతను చాటారని కొనియాడారు. కార్యక్రమంలో సంస్థ సీవోవో డాక్టర్ రవీందర్, జాయింట్ డైరెక్టర్ అపూర్వారావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు మునిశేఖర్, కృష్ణకాంత్, చీఫ్ పర్సనల్ ఆఫీసర్ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

లోకం పోకడ

ఇదెక్కడి అన్యాయం? మొత్తం తాగేవరకన్నా ఆగరా?

వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	42.2°c	27.4°c
రంగారెడ్డి	39.9°c	23.6°c
మెదక్	38.6°c	25.5°c
నల్లగొండ	38.0°c	24.4°c
నిజామాబాద్	37.5°c	27.6°c
కరీంనగర్	37.0°c	27.0°c
మహబూబ్‌నగర్	36.3°c	27.5°c
వరంగల్	34.0°c	27.0°c
హైదరాబాద్	33.1°c	26.3°c
ఖమ్మం	33.0°c	23.0°c

పీసీసీ ఇస్తే మంత్రి పదవి వదిలేస్తా!

- అధిష్ఠానానికి ఉమ్మడి కరీంనగర్ జిల్లా మంత్రి ప్రతిపాదన
- 2029 ఎన్నికల్లో కీలకపాత్ర పోషించేందుకు వ్యూహం
- ఢిల్లీలో ముమ్మరంగా లాబీయింగ్

హైదరాబాద్, జూన్ 19 (నమస్తే తెలంగాణ): టీపీసీసీ అధ్యక్ష పదవిపై ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ఒక మంత్రి ఆసక్తి చూపుతున్నట్టు కాంగ్రెస్ పార్టీలో జోరుగా చర్చించుకుంటున్నారు. తనకు పీసీసీ అధ్యక్ష పదవిని అప్పగిస్తే, మంత్రి పదవిని సైతం వదులుకునేందుకు ఆయన సిద్ధమైనట్టు తెలిసింది. ఈ మేరకు అధిష్ఠానానికి సంకేతాలు కూడా పంపినట్టు సమాచారం. పీసీసీ బాస్‌ను కావాలన్న పట్టుదలతో ఉన్న ఆ మంత్రి, ఇప్పటికే ఢిల్లీలో తన వంతు ప్రయత్నాలను ముమ్మరం చేసినట్టు తెలుస్తున్నది. పీసీసీ అధ్యక్ష పదవిని ఈసారి బీసీ నేతకు ఇస్తారనే ప్రచారం పార్టీలో జోరుగా జరుగుతున్నది. ముఖ్యమంత్రి పదవి రెడ్డి సామాజిక వర్గానికి, డిప్యూటీ సీఎం పదవి ఎస్సీ సామాజిక వర్గానికి ఇచ్చిన నేపథ్యంలో పార్టీ పగ్గాలను బీసీలకు ఇవ్వాలంటూ బీసీ నేతలు గట్టిగానే వాదిస్తున్నారు. అధిష్ఠానం కూడా ఇదే ధోరణిలో ఆలోచన చేస్తున్నట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో ఆ బీసీ మంత్రి పీసీసీ పీఠం కోసం గట్టిగానే ప్రయత్నిస్తున్నట్టు తెలిసింది.

మంత్రి పదవి కన్నా పీసీసీ పీఠమే ఎక్కువ

ఎమ్మెల్యేగా గెలిచిన ఏ నాయకుడైనా సహజంగా మంత్రి పదవిని కోరుకుంటారు. ఇందుకు విరుద్ధంగా ఆ బీసీ నేత తనకు మంత్రి పదవి దక్కినప్పటికీ, పీసీసీ పీఠానికే ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇందుకు కారణాలు లేకపోలేదు. మంత్రి పదవి అయితే ఒక శాఖ, మహా అయితే ఒక జిల్లా అధీనంలో ఉంటుంది. పీసీసీ అధ్యక్ష పదవి దక్కితే, పార్టీ మొత్తం తన అధీనంలో ఉండే అవకాశం ఉంటుంది. సదరు మంత్రి పీసీసీ పీఠం కోసం ప్రయత్నం చేయడానికి మరో కారణం కూడా ఉన్నది. ఇప్పటికే పార్టీ అధికారంలోకి వచ్చి ఆరు నెలలైంది. మరో నాలుగున్నర ఏండ్లలో అసెంబ్లీ ఎన్నికలు వస్తాయి. పీసీసీ చీఫ్ పదవీ కాలం మూడేండ్లు ఉంటుంది. ఈ పదవీ కాలం, ఇప్పటికే ప్రభుత్వం పూర్తి చేసుకున్న కాలం కలిపితే అటు ఇటుగా నాలుగేండ్లు గడిచిపోయినట్టే. ఆ తర్వాత ఎన్నికలకు మిగిలేది ఏడాది మాత్రమే. ఎన్నికలకు ఏడాది ముందు పీసీసీ అధ్యక్షుడిని మార్చే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయి. లాబీయింగ్‌ల ద్వారా ఆ ఏడాదిపాటు పీసీసీ పదవిని కాపాడుకుంటే, 2029 అసెంబ్లీ ఎన్నికల్లో తన అధ్యక్షతన పార్టీ ఎన్నికల్లో పోటీ చేస్తుందని సదరు మంత్రి లెక్కలు వేసుకుంటున్నట్టు తెలిసింది. ఎన్నికల సమయంలో పీసీసీ అధ్యక్షుడి అధికారం ఏవిధంగా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. అందుకే భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని మంత్రి పదవిని కూడా కాదనుకొని పీసీసీ అధ్యక్ష పదవిని దక్కించుకునేందుకు ఆయన ప్రయత్నిస్తున్నట్టు తెలిసింది.

రేవంత్‌రెడ్డి పీటముడి?

జూలై 7వ తేదీతో పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్ రెడ్డి పదవీ కాలం ముగియనున్నది. కొత్త పీసీసీ చీఫ్ ఎంపికపై ఆయన పీటముడి పెడుతున్నట్టుగా పార్టీలో చర్చ జరుగుతున్నది. కొత్త అధ్యక్షుడి ఎంపిక తన చేతిలో లేదంటూనే, నూతన అధ్యక్షుడి ఎంపికను ఆలస్యం చేస్తున్నట్టు పార్టీలో చర్చించుకుంటున్నారు. అధ్యక్ష పదవి కోసం మధుయాష్కీగౌడ్, పొన్నం ప్రభాకర్‌గౌడ్, జగ్గారెడ్డి, మహేశ్‌కుమార్‌గౌడ్ తదితరులు పోటీపడుతున్నారు. సీనియర్లు పీసీసీ పగ్గాలు చేపడితే, తనకు ఇబ్బంది తప్పదనే ఆలోచన రేవంత్‌రెడ్డి చేస్తున్నట్టు తెలిసింది. ప్రభుత్వానికి, పార్టీకి మధ్య సమన్వయం దెబ్బతింటుందనే వాదనను ఆయన అధిష్ఠానం ముందు ఉంచినట్టు ప్రచారం జరుగుతున్నది. మరికొంతకాలం తానే పీసీసీ అధ్యక్షుడిగా కొనసాగాలని భావిస్తున్నట్టు తెలిసింది.కుదరని పక్షంలో అనుయాయులను అధ్యక్ష పీఠంపై కూర్చోబెట్టే ప్రయత్నిస్తున్నారనే ప్రచారం జరుగుతున్నది.

కేంద్రమంత్రి పదవి ప్రజల భిక్షే: బండి

కరీంనగర్‌లో ఘన స్వాగతం

కరీంనగర్ విద్యానగర్, జూన్ 19: కేంద్ర మంత్రి పదవి కరీంనగర్ ప్రజలు, కార్యకర్తలు పెట్టిన భిక్షేనని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. కేంద్ర మంత్రి బాధ్యతలు స్వీకరించిన అనంతరం మొదటిసారి బుధవారం కరీంనగర్ వచ్చిన ఆయనకు స్థానిక నేతలు ఘనస్వాగతం పలుకగా కరీంనగర్ కమాన్ వద్ద నేలపై ప్రణమిల్లారు. అక్కడి నుంచి చైతన్యపురిలోని మహాశక్తి అమ్మవారు, కొండగట్టు అంజన్న, కొడిమ్యాల మండలం నల్లగొండ లక్ష్మీనరసింహస్వామి, వేములవాడ రాజన్నను దర్శించుకున్నారు.

దేశవ్యాప్తంగా లోటు వర్షపాతమే

- సాధారణంకన్నా 20శాతం తక్కువ నమోదు
- నైరుతి ముందే వచ్చినా కదలికల్లో లేని పురోగతి

హైదరాబాద్, జూన్ 19 (నమస్తే తెలంగాణ): నైరుతి రుతుపవనాలు ఈ ఏడాది దేశంలోకి ముందుగానే ప్రవేశించినా ఇప్పటి వరకు 20శాతం తక్కువ వర్షపాతం నమోదైనట్టు భారత వాతావరణ విభాగం (ఐఎండీ) వెల్లడించింది. జూన్ 12-18 మధ్య రుతుపవనాల కదలికల్లో పెద్దగా పురోగతి కనిపించలేదని పేర్కొన్నది. రానున్న 3-4 రోజుల్లో మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, కోస్తాంధ్ర, బీహార్, జార్ఖండ్‌లో పరిస్థితులు అనుకూలంగా మారనున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. జూన్ 1-18 మధ్య భారత్‌లో 64.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్టు ఐఎండీ వెల్లడించింది. సాధారణంగా ఈ సమయంలో సగటున 80.6 మిమీ వర్షపాతం కురవాల్సి ఉందని తెలిపింది. జూన్ 1నుంచి భారత వాయువ్య ప్రాంతంలో 10.2 మిమీ (సాధారణం కంటే 70శాతం తక్కువ), మధ్య భారత్‌లో 50.5మిమీ (సాధారణం కంటే 31శాతం తక్కువ), దక్షిణాదిలో 106.6 మిమీ (సాధారణం కంటే 16శాతం అధికం), తూర్పు, ఈశాన్య ప్రాంతాల్లో 146.7మిమీ (సాధారణం కంటే 15శాతం తక్కువ) వర్షపాతం నమోదైనట్టు ఐఎండీ పేర్కొన్నది. జూన్ నెలలో దేశవ్యాప్తంగా సాధారణం కంటే తక్కువ వర్షపాతమే నమోదవుతుందని ఐఎండీ అంచనా వేసింది. దక్షిణాది, ఈశాన్య రాష్ట్రాల్లో సాధారణం, అంతకంటే ఎక్కువ, వాయువ్యం, మధ్య భారత్‌లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదు కావచ్చని పేర్కొన్నది.

ఐదు రోజులపాటు వర్షాలు

హైదరాబాద్, జూన్ 19 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఐదురోజుల పాటు వర్షాలు కొనసాగుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఉపరితల ఆవర్తనం కోస్తా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రాంతంపై సముద్రమట్టానికి సగటున 5.8 కి.మీ ఎత్తులో విస్తరించి ఉన్నట్టు తెలిపింది. కోస్తాను ఆనుకుని పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో సముద్రమట్టానికి సగటున 3.1 కి.మీ ఎత్తులో ఉపరితల ఆవర్తనం బుధవారం విస్తరించి ఉన్నదని, దీని ప్రభావం తో రాబోయే ఐదు రోజులు ఏపీ, తెలంగాణలో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతోపాటు, ఉరుములు, మెరుపులతో తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ వెల్లడించింది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో పిడుగులు పడే అవకాశం ఉందని అంచనా వేసింది. ఆదివారం వరకు ఎల్లో అలర్ట్ ప్రకటించింది. ములుగులో అత్యధికంగా అంటే 96.3 మి.మీ వర్షపాతం నమోదైంది. హైదరాబాద్‌లో అత్యల్పంగా షేక్‌పేటలో 3.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్టు వాతావరణ శాఖ తెలిపింది.

21న క్యాబినెట్ సమావేశం

రుణమాఫీ మార్గదర్శకాలు, బడ్జెట్‌పై చర్చ

హైదరాబాద్, జూన్ 19 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఈ నెల 21వ తేదీన జరుగనున్నది. ఈ మేరకు సీఎస్ శాంతికుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం సాయంత్రం 4 గంటలకు సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో సమావేశం ప్రారంభం కానున్నది. ఈ సందర్భంగా రుణమాఫీ అమలుపై చర్చించి, మార్గదర్శకాలను ఆమోదించే అవకాశం ఉన్నట్టు తెలుస్తున్నది.బడ్జెట్ రూపకల్పన, అసెంబ్లీ సమావేశాలు, బిల్లులపై చర్చించే అవకాశం ఉన్నదని సచివాలయ వర్గాలు తెలిపాయి.

వార్షిక రుణ ప్రణాళిక ఖరారు

- వ్యవసాయానికి 1.34 లక్షల కోట్లు
- క్రాప్‌లోన్ కింద రూ. 81వేల కోట్లు
- ఎస్ఎల్‌బీసీ రుణ ప్రణాళిక విడుదల
- మొత్తం 2.80లక్షల కోట్లతో ప్రణాళిక

బ్యాంకర్ల సమావేశంలో రుణ ప్రణాళికను విడుదల చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్, జూన్ 19(నమస్తే తెలంగాణ): 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను వ్యవసాయరంగానికి రూ.1.34 లక్షల కోట్లతో రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ(ఎస్ఎల్‌బీసీ) రుణ ప్రణాళికను ఖరారు చేసింది. ఇందులో రూ.81వేల కోట్లను క్రాప్‌లోన్ కింద రైతులకు అందించనున్నది. బుధవారం నిర్వహించిన సమావేశంలో వార్షిక రుణ ప్రణాళికను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విడుదల చేశారు. మొత్తం రూ. 2.80 లక్షల కోట్లతో ఎస్ఎల్‌బీసీ వార్షిక రుణ ప్రణాళికను రూపొందించింది. ఇందులో వ్యవసాయరంగానికి 1.34 లక్షల కోట్లు కేటాయించింది. గతంకన్నా 18.95శాతం రుణస్థాయిని పెంచింది. ఇందులో స్వల్పకాలిక(క్రాప్‌లోన్) రుణం కోసం రూ. 81,478కోట్లు కేటాయించింది. ఇది గతేడాదితో పోల్చితే 10.95శాతం అధికం. ఎంఎస్ఎంఈలకు రూ.1.29 లక్షల కోట్లతో రుణ ప్రణాళికను రూపొందించింది. హౌసింగ్ సెక్టార్‌కు రూ.10,768 కోట్లు, విద్యకు రూ. 2,706 కోట్లు, ఇతర రంగాలకు రూ. 3,301 కోట్ల రుణ ప్రణాళికను ఖరారు చేసింది.

రాహుల్ మాటకు రాష్ట్రంలో విలువలేదా?

- బీసీ రిజర్వేషన్లను తేల్చాకే ఎన్నికలు
- జూలై మొదటి వారం నుంచి బస్సు యాత్ర
- ఆగస్టులో హైదరాబాద్ బిగ్బంధం
- బీసీ మేధావుల మేధోమథన సమావేశంలో నేతల వెల్లడి

సమావేశంలో అభివాదం చేస్తున్న బీసీ సంఘాల నాయకులు

ఖైరతాబాద్, జూన్ 19: ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ హామీలకు తెలంగాణలో విలువను ఇవ్వడం లేదని బీసీ సంఘాల నేతలు ధ్వజమెత్తారు. హైదరాబాద్ లక్డీకాపూల్‌లో బుధవారం బీసీ మేధావుల మేధోమథన సమావేశం జరిగింది. బీసీ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో 'సమగ్ర కులగణనకు సవాళ్లు-డెడికేషన్ కమిషన్ ఏర్పాటు-స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల పెంపు' అన్న అంశంపై జరిగిన చర్చలో జాతీయ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ ఈశ్వరయ్య మాట్లాడారు. ఏఐసీసీ నేత రాహుల్‌గాంధీ స్వయంగా కులగణన చేస్తామని, బీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చారని, దీంతో దేశవ్యాప్తంగా ఓబీసీలు అధిక సంఖ్యలో కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చారని తెలిపారు. కానీ ఆయన మాటకు విరుద్ధంగా నేడు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవహరిస్తుండటం బాధాకరమని పేర్కొన్నారు. కులగణన చేపట్టి, రిజర్వేషన్లు పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు మాట్లాడుతూ బీసీలను అన్ని రాజకీయ పార్టీలు మోసం చేశాయని, ఇప్పటికైనా న్యాయంచేయని పక్షంలో మరో మండల్ ఉద్యమం జరుగుతుందని హెచ్చరించారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ బీసీ కులగణనపై సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు మౌనం వహిస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. తక్షణమే బీసీ మేధావులను చర్చలకు ఆహ్వానించి రిజర్వేషన్ల పెంపుపై మార్గదర్శకాలను విడుదల చేయాలని కోరారు. కులగణనపై నిర్లక్ష్యం వహిస్తే ఉద్యమాలు తప్పవని స్పష్టంచేశారు. దీనిలో భాగంగా జూలై మొదటి వారంలో బస్సు యాత్ర చేపడుతామని, ఆగస్టు మొదటి వారంలో హైదరాబాద్‌ను బీసీలతో దిగ్బంధిస్తామని హెచ్చరించారు. సమావేశంలో ప్రొఫెసర్ తిరుమలి, ప్రొఫెసర్ సింహాద్రి, తెలంగాణ బీసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విజయ్‌భాస్కర్‌గౌడ్, బీసీ మేధావులు సుంకర సత్యనారాయణ, ప్రొఫెసర్ వినయ్‌బాబు, ప్రొఫెసర్ వెంకట్రాజయ్య, సమ్మయ్య, వేణుమాధవ్, కుల్కచర్ల శ్రీనివాస్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర కాంగ్రెస్ తీరుపై అధిష్ఠానం సీరియస్

లోక్‌సభ ఎన్నికల్లో పేలవమైన ఫలితాలపై నివేదికకు ముగ్గురు సభ్యులతో కమిటీ

హైదరాబాద్, జూన్ 19 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో అధికారంలో ఉండి కూడా లోక్‌సభ ఎన్నికల్లో పేలవమైన ఫలితాలను సాధించడాన్ని కాంగ్రెస్ అధిష్ఠానం సీరియస్‌గా తీసుకుంది. డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం చేపట్టి ఐదు నెలలు అయినా తిరగకముందే ఎంపీ ఎన్నికల్లో ఆశించిన మేరకు సీట్లు గెలుపొందక పోవడానికిగల కారణాలను విశ్లేషించి నివేదిక ఇచ్చేందుకు ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసినట్టు తెలిసింది. తెలంగాణతోపాటు కర్ణాటక, హిమాచల్‌ప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఢిల్లీ, ఉత్తరాఖండ్ రాష్ట్రాల లోక్‌సభ ఎన్నికల ఫలితాలు ఆశించిన మేరకు లేకపోవడానికిగల కారణాలపై నివేదిక కోరుతూ కమిటీలను ఏర్పాటు చేసినట్టు సమాచారం.

తెలంగాణపై త్రిసభ్య కమిటీ

తెలంగాణలో పేలవమైన ఫలితాలకుగల కారణాలపై నివేదిక ఇచ్చేందుకు ఏర్పాటు చేసిన కమిటీలో పీజే కురియన్ (కేరళ), రకీబుల్ హసన్ (అస్సాం), పర్గత్‌సింగ్ (పంజాబ్) ఉన్నట్టు సమాచారం. కర్ణాటకపై కమిటీలో మధుసూదన్ మిస్త్రీ, గౌరవ్ గొగోయ్, హిబీ ఈడెన్, మధ్యప్రదేశ్ కమిటీలో పృథ్వీరాజ్ చవాన్, సప్తగిరి ఉల్కా, జిగ్నేశ్ మేవానీ, ఛత్తీస్‌గఢ్ కమిటీలో వీరప్ప మొయిలీ, హరీశ్‌చౌదరి, ఒడిశా కమిటీలో అజయ్ మాకెన్, తారిక్ అన్వర్, ఢిల్లీ, ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్ కమిటీలో పీఎల్ పునియా, రజనీ పాటిల్ ఉన్నారని సమాచారం.

12 సీట్లు వస్తాయనుకుంటే 8 సీట్లేనా?

తెలంగాణలో కనీసం 12 సీట్లు గెలుచుకోవాలన్నది కాంగ్రెస్ అధిష్ఠానం లక్ష్యం. కానీ 8 సీట్లతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చిం ది. ఫలితాలు వెలువడిన రోజుననే పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఫోన్ చేసి పీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతోపాటు రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్‌మున్షీతో మాట్లాడి తమ అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందే తాను హైదరాబాద్ వచ్చి సర్వే నివేదికల్లో కాంగ్రెస్ వెనుకబడిందని హెచ్చరించినా ఎందుకు సీరియస్‌గా తీసుకోలేదని మండిపడిన విషయం తెలిసిందే. దీనిపై ఇప్పటికే దీపాదాస్ మున్షీని అధిష్ఠానం నివేదిక కూడా కోరింది. పీసీసీ నాయకత్వానికి, ఎంపీ నియోజకవర్గాలకు ఇన్‌చార్జీలుగా వ్యవహరించిన మంత్రులకు మధ్య సమన్వయ లోపం, అభ్యర్థుల ఎంపికలో తప్పిదాలు జరిగినట్టు ఏఐసీసీ ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చినట్టు తెలిసింది. ఇంకా తప్పిదం ఎక్కడ జరిగింది? దీనికి బాధ్యులు ఎవరు? అనే దానిపై సమగ్ర నివేదిక కావాలని ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీని ఏఐసీసీ తాజాగా ఏర్పాటు చేసినట్టు ఈ వర్గాల సమాచారం.

అప్పులు తెస్తం.. అభివృద్ధి చేస్తం

మొదటిపేజీ తరువాయి...

చర్యలకు అడ్డుకట్ట వేయొచ్చని అభిప్రాయపడ్డారు. పీసీసీ నూతన అధ్యక్షుడి నియామకంపై ఆయన స్పందిస్తూ... ఇది పూర్తిగా అధిష్ఠానం పరిధిలో ఉందన్నారు. దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని, ఇక్కడ పెట్టుబడులకు సహకరించాలని,అన్ని రంగాల వారికి విరివిగా రుణాలు అందించాలని బ్యాంకర్లను కోరినట్టు తెలిపారు.

జగదీశ్‌రెడ్డి సూచన మేరకే కమిషన్

విద్యుత్ కొనుగోలు, విద్యుత్ కేంద్రాల ఏర్పాటుపై విద్య